TELTEL/2023/87917

# జనంవెలుగు

అనునిత్యం అక్షరసత్యం

www.janamvelugu.com, janamvelugu2023@gmail.com

విలేఖర్లు కావలెను

జనం వెలుగు న్యూస్ దినపత్రిక నందు పనిచేయుటకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా అన్ని ప్రాంతాలనుండి జిల్లా మరియు మండల విలేఖరులు కావలెను

ఆసక్తి కలవారు వెంటనే సంప్రదించండి

9603322119

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ సంపుటి : 02 సంచిక : 175 శుక్రవారం 20 - 09 - 2024 ఎడిటర్ : సీతార్ల సురేష్ పేజిలు : 8 వెల : 6/-

# కబ్జ కోరల నుండి నిజమబాద్ ను కాపాడాండి

**జిల్లాలో ఆక్రమణలకు గురవౌతున్న చెరువులు, కుంటలను రక్షించండి**

**అక్రమ నిర్మాణాలను విద్యుత్తు మీటర్లు ఎట్లా ఇస్తారు**

**తెలంగాణ మేధావుల సంఘం చైర్మన్ డాక్టర్ కేశవుల డిమాండ్**



**జనం వెలుగు, నిజామాబాద్:–** జిల్లాలోని వివిధ ప్రాంతాలలో గల చెరువులు, కుంటలను, వాగులు, ప్రభుత్వ పార్కులను, అక్రమ నిర్మాణాల నుండి నిజామాబాద్ ను కాపాడాలని తెలంగాణ మేదావుల సంఘం చైర్మన్ డాక్టర్ కేశవులు డిమాండ్ చేశాడు. హైదరాబాద్ లో ఏర్పాటు చేసిన హైడ్రా తరహా నిజామాబాద్ లో నిడ్రాను ఏర్పాటు చేసి భూ ఆక్రమణ దారులపై పంజా విసరాలని గురువారం జిల్లా కలెక్టర్ కు ఓ వినతి పత్రాన్ని ఆయన సమర్పించాడు. ఈ సంధర్బంగా మాట్లాడుతూ నిజామాబాద్ లోని పూలాంగ్ వాగు, గాయత్రి నగర్ నుండి ముబారక్ నగర్ వరకు ఏర్పడిన అక్రమ నిర్మాణాలు, కబ్జాలు, ప్రభుత్వ పార్క్ లతో పాటు, నగర శివారులోని నిజామాబాద్– బోధన్ రహదారి పక్కనే గల 30 ఎకరాల రామర్తి చెరువు, శిఖం భూమి కొంతకాలంగా కబ్జాకు గురవుతూ ప్రస్తుతం సగం కూడా లేదని ఆయన ఆందోళన వ్యక్తం చేశాడు. ఇళ్ళు కట్టుకున్న వారి కోసం శిఖం భూమి ప్రాంతంలో స్థంభాలు ఏర్పాటు చేసి మరీ విద్యుత్తు మీటర్లు ఇచ్చారని, కబ్జా చేసిన వారిపై చర్యల జోలికి పోకుండా మిగిలిన ప్రాంతానికి ఫెన్సింగ్ చేసి చేతులు దులుపుకొన్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశాడు. నాగారంలోని బొందెం చెరువు ఆక్రమణలపై మాత్రం ఆలస్యంగా మేల్కొన్నారని ఆర్మూర్ పట్టణంలోని పెర్కిట్–కొటార్మూర్ గ్రామాల చెరువులకు నిజాంసాగర్ ప్రాజెక్టు నీటిని అందించిన మైనర్ కాలువ ఆక్రమణలు, బోధన్ ప్రాంతంలోనూ చెక్కి చెరువు కబ్జాకు గురైనట్లు సర్వేలో గుర్తించారని ఆయన తెలిపాడు. భీంగల్ లో దాదాపు 73 ఎకరాల విస్తీర్ణంలోని రాథం చెరువు శిఖం ప్రాంతం 10 ఎకరాలకు మించి ఆక్రమణలను గురైందని, మొగిలి చెరువు, ధర్మా రాయుడి కుంట ఆక్రమణలపై ఫిర్యాదులున్నాయని ఆయన తెలిపాడు. ఇక జిల్లాలో చెరువు శిఖాలు, కాల్వల బఫర్ జోన్లలో నిర్మాణాలు చేపడుతుంటే నీటిపారుదలశాఖ, మున్సిపల్, రెవెన్యూ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపణ లు ఉన్నాయని ఆయన తెలిపాడు. అదే విధంగా జిల్లావ్యాప్తంగా రియల్ ఎస్టేట్ వ్యాపారులు, ఇతర అక్రమార్కులు కబ్జాలకు పాల్పడిన చెరువులు, కుంటలు, ప్రభుత్వ భూములు, వాగులు, నాలాలు, ప్రభుత్వ గుట్టల ఆక్రమణలపై వెంటనే సర్వే చేసి,కబ్జాలకు ఆక్రమణకు గురైన వాటి వివరాలను అధికారికంగా స్వాధీనం చేసుకొని ఓ శ్వేత పత్రాన్ని విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశాడు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర నాయకుడు వెంకట్రాములు, బిఎల్ ఎఫ్ రాష్ట్ర నాయకుడూ దండి వెంకట్, సీపీఐ జిల్లా కార్యదర్శి సుధాకర్, సిపిఎం నాయకుడు వేమయ్య, అంకం జగదీష్, సామాజిక సేవకుడు ప్రజా సంఘాల నాయకుడు తూటికూర నర్సయ్య, అబ్బగోని అశోక్ గౌడ్ బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి, సీనియర్ జర్నలిస్టు నాయకులు డిఎల్ఎన్ చారి, సితార్ల సురేష్, చిలుక లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# గల్ఫ్ కార్మికుల కోసం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయించండి

## కోటపాటి నరసింహ నాయుడు



**జనం వెలుగు, బాల్కొండ:–** తెలంగాణ రాష్ట్రంలో గల్ఫ్ కార్మికుల సంక్షేమం కోసం సమగ్ర ఎన్ఆర్ఐ పాలసీ కొరకు ఓ బోర్డును ఏర్పాటు చేయాలని రాజ్ భవన్ లో గవర్నర్ జిస్ణు దేవ్ వర్మకు కోటపాటి నరసింహ నాయుడూ బృందం వినతి పత్రం సమర్పించారు. తెలంగాణ రాష్ట్ర గల్ఫ్ కార్మికుల కార్మికుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం చేపట్టాల్సిన చర్యలకై ప్రవాస భారతీయుల హక్కులు సంక్షేమ వేధిక అధ్యక్షుడు కోటపాటి నరసింహ నాయుడు ఆద్వర్యంలో గురువారం తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిస్ణుదేవ్ వర్మకు వినతిపత్రం సమర్పించారు. తెలంగాణ రాష్ట్రం నుండి లక్షల సంఖ్యలో 18 ఇసిఆర్ దేశాలకు (ఆదేశాలకు కార్మికులుగా వెళ్లాలంటే ఎమిగ్రే షన్ తనిఖీ తప్పనిసరి) కార్మికులు వలస వెళ్ళారని కోటపాటి నరసింహ నాయుడు తెలిపాడు. అట్టి 18 దేశాలే కాకుండా కాంబోడియా, రష్యా లాంటి దేశాలకు కూడా ఉపా ధికై వెళుతుండగా రాష్ట్ర ప్రభుత్వం కేవలం 7 గల్ఫ్ దేశాలకు వెళ్లే వారికి వర్తించే విధంగా జిఓ ఎంఎస్ 205 ను 16/09/2024 రోజున విడుదల చేసిందని ఆయన అన్నాడు. దాని పరిధి విస్తరించే విధంగా రాష్ట్ర ప్ర భుత్వాన్ని ఆదేశించాల్సిందిగా ప్రతి నిధి బృందం గవర్నర్ ను కోరడం జరిగిందని ఆయన తెలిపాడు. సానుకూలంగా స్పందించిన గవర్నర్ రాష్ట్ర ముఖ్యమంత్రి దృష్టికి తీసుకు వెళ్ళుతానని గవర్నర్ హామీ ఇచ్చాడని ఆయన తెలిపాడు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు సమగ్ర ఎన్ఆర్ఐ పాలసీ గల్ఫ్ కార్మిక సంక్షేమ బోర్డు ఏర్పాటు చెయాల్సి ఉందని, కానీ హడావిడిగా ఈనెల 16 వ తేదీన కేవలం 7 గల్ఫ్ దేశా లకే వర్తించే విధంగా ఎవరైనా గల్ఫ్ దేశాలలో చనిపోతే 5 లక్షలు నష్టపరిహారం ఇవ్వడానికి నిర్ణయించడం అది కూడా డిసెంబర్ 7 వ తేదీ 2023 నుండి ఇస్తామని ప్రకటించాడని ఆయన తెలిపాడు. యుఏఇ, బెహ్రాయిన్, ఖత్తర్, ఓమన్, కువైట్, సౌదీ, ఇరాక్ దేశాలలో గల మన కార్మికులు మరణిస్తేనే నష్టపరిహారం అందుతాదని ఆయన తెలిపాడు. కానీ మిగితా ఇసిఆర్ దేశాలకు వెళ్ళిన కార్మికులకు కూడా జిఓ 205 ను వర్తింప జేయాల్సిందిగా డిమాండ్ చేస్తున్నా మని ఆయన తెలిపాడు. నష్టపరి హారం అందించే మృత్తుల కుటుంబాలు దారిద్ర రేకకు దిగువన ఉన్నాయని, కనుక వారిని కూడా ఆదుకో వడానికి జూన్ నెల 2014 నుండి చెల్లించాల్సిందిగా ఆయన కోరాడు. సమగ్ర ఎన్ఆర్ఐ పాలసీలతో కూడి న1000 కోట్ల బడ్జెట్ తో “గల్ఫ్ కార్మిక సంక్షేమ బోర్డు” వెంటనే ఏర్పాటు చేయాలని కోటపాటి బృందం డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కువైట్ తెలంగాణ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, గల్ఫ్ జెఏసి ఉపాధ్యక్షుడు గంగుల మురళీ దర్ రెడ్డి, నిజామాబాద్ జిల్లా గల్ఫ్ కార్మిక నాయకుడు పట్లూరి తిరుపతి రెడ్డి, సౌది రిటర్నుడ్ కొక్కుల విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

# ఐక్య కార్యాచరణ అధ్వర్యంలో ధర్నా



**జనం వెలుగు, ఆర్మూర్:–** ఆర్మూర్ డివిజన్ రైతు ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో డివిజన్ వ్యాప్తంగా 24 మండల కేంద్రాల్లో రైతు రుణమాఫీ చేయాలని ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం ఎమ్మార్వోకు మెమోరాండం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం మాయ మాటలు చెప్పి అధికారంలోకి వచ్చి, ప్రతి కుటుంబానికి రెండు లక్షల రూపాయల మాఫీ చేస్తానని చెప్పి అడ్డగోలుగా ఆంక్షలు విధించి 20 శాతం మందికి కూడా మాఫీ చేయకుండా మిగిలిన వారిని హరి గోస పెడుతున్నారాని అన్నారు. రైతులను ఆంక్షలు పేరుతో బ్యాంకుల చుట్టూ రోడ్ల చుట్టూ అధికారుల చుట్టూ తిప్పుతూ వారి బతుకులతో చెలగాటమాడుతున్నాడని, రైతులతో పెట్టుకున్న ఏ ప్రభుత్వం బాగుపడిన చరిత్ర లేదని చెప్పారు. ఎన్నికల్లో హామీ ఇచ్చినట్టు రెండు లక్షలు రుణమాఫీ 500 రూపాయల బోనస్ 15వేల రూపాయల రైతు బంధు అమలు చేయకపోతే ఈ అబద్ధపు మాటలు అవినీతి పాలనకు రైతులు రాష్ట్ర ప్రజలు చరమగీతం పాడుతారని ఆర్మూర్ డివిజన్ నాయకులు గంగన్న, మచ్చర్ల సాగర్, వెల్మల్ రాజన్న, భూతం సాయిరెడ్డి తెలపడం జరిగింది. ఈ కార్యక్రమంలో రైతు ఐక్య కమిటీ నాయకులు అబ్బి గంగారెడ్డి, బాలగంగాధర్, చిన్నారెడ్డి, ప్రవీణ్, రామారావు, ప్రభాకర్, సుధాకర్, దేవన్న, గాండ్ల సంతోష్, మనోజ్ రావు, చిన్నయ్య, పోశెట్టి, రాజన్న తదితరులు పాల్గొన్నారు.

## బాల్కొండలో సిఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణి



**జనం వెలుగు, బాల్కొండ:–** మండల కేంద్రమైన బాల్కొండ పట్టణంలో గురువారం సిఎంఆర్ఎఫ్ చెక్కులను కాంగ్రెసు నాయకులు పంపిణి చేయడం జరిగింది. బాల్కొండ నియోజకవర్గపు కాంగ్రెసు పార్టీ ఇంచార్జి ముత్యాల సునీల్ రెడ్డి మంజూరి చేయించిన సిఎంఆర్ఎఫ్ చెక్కులను కాంగ్రెసు నాయకులు పంపిణి చేయడం జరిగింది. బాల్కొండకు చెందిన ఆరేపల్లి కృష్ణ 40 వేల రూపాయలు, జక్క గంగానర్సుకు 38 వేల రూపాయలు, ఈర్ల పెద్ద పోశెట్టి 16 వేల రూపాయలు, గాండ్ల చిన్నయ్యకు 14 వేల రూపాయల చెక్కులను తదితరులకు అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో బాల్కొండ పట్టణ అధ్యక్షుడు సంజీవ్ గౌడు, మైనారిటి అధ్యక్షుడు జావిద్, బాల్కొండ పట్టణ ఇంచార్జి మోహన్ రెడ్డి, తథితర నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## కాంగ్రెసు పార్టీకి బంట్రోతుగా మారిన కలెక్టర్

**బిజెపి ఫ్లోర్ లీడర్ జివి నరసింహా రెడ్డి**



**జనం వెలుగు, బాల్కొండ:–** అవినీతి, అక్రమాలను అరికట్టాల్సిన జిల్లా కలెక్టరే కాంగ్రెసు పార్టీకి బంట్రోతుగా మారాడని ఆర్మూర్ మున్సిపల్ బిజె పి ఫ్లోర్ లీడర్ జివి నరసింహా రెడ్డి ఆరోపించాడు. ఆర్మూర్ మున్సిపా లిటీలో జరిగిన అవినీతి అక్రమాలపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని గురువారం మున్సిపల్ కుర్చీకి వినతిపత్రాన్ని సమర్పించిన అనంతరం స్థానిక విలేఖరులతో ఆయన మాట్లాడాడు. ప్రజా సమస్యలపై వినతిపత్రాన్ని అందజేయనున్నామని మున్సిపల్ కమిషనర్ రాజు ఏదో పనిమీద బయటకు వెళ్ళానని చెప్తు కాలయాపన చేస్తూ, కార్యాలయానికి రాకపోగా గత్యంతరం లేక తాము మున్సిపల్ కుర్చీకి వినతి పత్రాన్ని అందజేసి వినూత్న రీతిలో నిరసన తెలపడం జరిగిందని ఆయన అన్నాడు. ఆర్మూర్ మున్సిపాలిటీలో జరిగిన అవినీతి అక్రమాలను బయటకు తీయాలని జూన్ 6 న, జిల్లా కలెక్టర్ కు పిర్యాదు చేసినప్పటికీ ఇప్పటి వరకు ఏలాంటి స్పందన రాలేదని ఆయన ఆందోళన వ్యక్తం చేశాడు. ఇటీవల మున్సిపల్ చెత్త వాహన అద్దాలను కాంగ్రెసు పార్టీ కౌన్సిలర్ ద్వంసం చేసి ప్రజా ఆస్థికి నష్టం కల్గించిన కాంగ్రెసు కౌన్సిలర్ పై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశాడు. అంతే గాకుండా మున్సి పాలిటి కొనుగోలు చేసిన 36 చెత్త బండ్లలో 16 నాసిరకం చెత్తా బండ్లను కొనుగోలు చేసి,ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేశారని ఆయన ఆరోపించాడు.

## కట్టుదిట్టమైన భద్రత నడుమ ఈవీఎంల తరలింపు

**పర్యవేక్షించిన కలెక్టర్, అదనపు కలెక్టర్**



**జనం వెలుగు, నిజామాబాద్, సెప్టెంబర్ 19:** జిల్లా కేంద్రంలోని వినాయక్ నగర్ లో గల ఈవీఎం గోడౌన్ నుండి కట్టుదిట్టమైన భద్రత నడుమ సాంకేతిక లోపాలు తలెత్తిన ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలను గురువారం బెంగళూరులోని భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ (బీ.ఈ.ఎల్)కు తరలించారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ ల పర్యవేక్షణలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో పకడ్బందీ ఏర్పాట్ల నడుమ ఈవీఎంల తరలింపు జరిగింది. పోలీసు బందోబస్తు మధ్య ప్రత్యేక వాహనంలో 78 బ్యాలెట్ యూనిట్లు, రెండు కంట్రోల్ యూనిట్లను బీ.ఈ.ఎల్ కు తరలించారు. ఎలాంటి లోటుపాట్లు, గందరగోళానికి తావులేకుండా ఈ.సీ సూచనలకు అనుగుణంగా ప్రణాళికాబద్ధంగా ఈవీఎంలను తరలించారు. ఈ ప్రక్రియలో ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు పవన్, సాత్విక్ తదితరులు పాల్గొన్నారు.

## కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి కార్యక్రమానికి విచ్చేయనున్న మంత్రి కొండా సురేఖ



**జనం వెలుగు:–** సెప్టెంబర్ 21 న జలదృశ్యం వద్ద ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజి వర్ధంతిని పురస్కరించుకుని బిసి రాజ్యాధికార సమితి మంత్రి కొండా సురేఖను సచివాలయంలోని వారి కార్యాలయంలో కలిసి, ట్యాంక్ బండ్ లోని జలదృశ్యంలో నిర్వహించే కార్యక్రమానికి ఆహ్వానించింది. మంత్రిని కలిసిన వారిలో బిసి రాజ్యాధికార సమితి అధ్యక్షుడు దాసు సురేష్, కన్వీనర్ లక్ష్మణ్, కో కన్వీనర్ కిషోర్ వున్నారు.

# ఉచిత బస్సు ప్రయాణం - ప్రజలకు ప్రాణ సంకటం



**జనం వెలుగు, బాల్కొండ:–** తెలంగాణ రాష్ట్రంలో (ఉచిత) బస్సు ప్రయాణ సౌకర్యం వలన ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని ప్రజలు తమ ప్రయాణాలను కొనసాగించాల్సిన పరిస్థితి దాపురించింది. ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని ప్రభుత్వం ఎవరికి ఇవ్వాలి ఎవరికి ఇవ్వ ద్దనే నిర్ణయాన్ని శాసకుల (పాలకులు) నిర్ణయం. కేవలం కాంగ్రెసు ప్రభుత్వం హయాంలో తెలంగాణ రాష్ట్రంలో బస్సు ప్రయాణం అంటేనే ప్రజలకు ప్రాణసంకటంగా మారిందని చెప్పక తప్పదు. వచ్చే బస్సు ఆగుతుందో తెలియదు. ఆగదో తెలియదు ఒకవేళ బస్సు ఆగిన దాంట్లోకి ఎక్కుతామా తెలియదు, ఎక్కే సమయానికి స్టాండింగ్ లోని ఫుట్ బోర్డు మీద నిలబడి రైట్, రైట్ అంటూ వేరే బస్సులో రండని, బస్సు తుస్సుమని వెళ్ళి పోతుంది. బస్సుఎక్కాలంటే ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని బస్సును ఎక్కాల్సిన పరిస్థితిని మన పాలకులు కల్పించినందుకు నవ్వాలో, ఏడ్వాలో అర్థం కాని అయోమయ పరిస్థితిలో ప్రజలు ఉన్నారు. కేవలం మహిళా మణుల కోసమే ఈ ఉచిత బస్సు సౌకర్యం కల్పించడం రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ఎలా ఉన్నగాని, కుంటి, గుడ్డి, తొంటి, బల హీనులైన వయో వృద్దులు వీరికి ఉచిత బస్సు సౌకర్యం కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వానికి చిన్న చూపెందుకు. ఇలా కాకుండా మహిళలకే ఉచిత బస్సు సౌకర్యం కల్పించడం వలన బస్సులలో సిగపట్లు తప్పడం లేదు. మహిళల మేడలో నుండి పుస్తెల త్రాడులు తెగిపోతున్న ఉచిత బస్సు సౌకర్యం కల్పించిన సిఎం రేవంత్ రెడ్డి పట్టించు కోలేకపోతున్నాడు. లక్ష రుపాయల ప్రభుత్వ ఉద్యోగిని అయిన (మహిళ) ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని కల్పించిన సిఎం రేవంత్ రెడ్డి, మారు మూల ప్రాంతాలలో (గ్రామీణులకు) విద్యార్థులకు, ప్రజలకు తమ తమ గ్రామాలకు వెళ్ళాలంటే బస్సులను ఎందుకు నడిపించడం లేదని సిఎం రేవంత్ రెడ్డిని గ్రామీణులు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వ ఉద్యోగినిలకు ఉచిత బస్సు సౌకర్యాన్ని కల్పించడం ఎంత వరకు న్యాయపరమో రాష్ట్ర ఖజానాపై బారం అను అంశాలపై సిఎంగా గల ఒక్క సారి మీరు పునరాలోచించాల్సిన బాధ్యత ఉందని ప్రజలు తమ తమ అభిప్రాయాలను వెలిబుచ్చారు. బస్సు ప్రయాణం చేయాలంటే భయపడాల్సిన పని పరిస్థితి ప్రజలకు దాపురించింది. వయో వృద్దులు, గర్భిణి స్త్రీలు, ఇలా ఎందరో అసహాయులు బస్సులో ప్రయాణం చేయలేక పోతున్నారు. వీరిని ఎవరు పట్టించు కోవాలి, మారు మూల గ్రామాలకు బస్సులను ఎందుకు నడపడం లేదు. ఆ గ్రామాలు మీ తెలంగాణ రాష్ట్రంలో లేవా అని సిఎంను ఈ ప్రాంత ప్రజానీకం ప్రశ్నిస్తోంది. ప్రభుత్వ ఉద్యోగ మహిళలకు సహితం ఉచిత బస్సు సౌకర్యాన్ని కల్పించినప్పుడు, గ్రామీణులకు బస్సు సౌకర్యం కల్పించకపోవడంలో ఎందుకు వివక్ష చూపుతున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

# ఇంటింటి సర్వేను నిర్ణీత గడువులో పూర్తి చేయాలి

## పరిశీలకులు అబ్దుల్ హమీద్ సూచన

## కలెక్టర్ తో కలిసి ఈఆర్ఓలు, ఏఈఆర్ఓలతో సమీక్ష



**జనం వెలుగు, నిజామాబాద్, సెప్టెంబర్ 19:** ఎస్ఎస్ఆర్–2025 లో భాగంగా ఓటరు జాబితా సవరణ కోసం కొనసాగుతున్న ఇంటింటి సర్వేను పక్కాగా నిర్వహించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సీఈఓ) కార్యాలయం నుండి పరిశీలకులుగా విచ్చేసిన స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అబ్దుల్ హమీద్ సూచించారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతుతో కలిసి గురువారం ఆయన సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో అదనపు కలెక్టర్లు, సబ్ కలెక్టర్లు, రెవెన్యూ డివిజనల్ అధికారులు, నియోజకవర్గ కేంద్రాల తహశీల్దార్లు, ఎన్నికల విభాగం సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. జిల్లాలో కొనసాగుతున్న ఓటరు నమోదు, ఓటరు జాబితా సవరణ, ఇంటింటి సర్వే, పోలింగ్ స్టేషన్ల నిర్వహణ ఏర్పాట్లు, స్వీప్ కార్యకలాపాలు, ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులు, దాఖలైన దరఖాస్తుల పరిశీలన తదితర అంశాలలో నియోజకవర్గాల వారీగా ప్రగతిని సమీక్షిస్తూ, రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ నెల 26 నాటితో గడువు ముగియనున్న దృష్ట్యా ఇంటింటి సర్వేను వేగవంతం చేయాలని, 100 శాతం సర్వే పూర్తయ్యేలా క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ జరపాలని అన్నారు. ఇప్పటికే సర్వే పూర్తి చేసిన బీఎల్ఓలను అవసరం ఉన్న చోట ఇతర పోలింగ్ కేంద్రాలలో సర్వే కోసం సర్దుబాటు చేయాలని సూచించారు. క్షేత్రస్థాయిలో ప్రతి ఇంటికి తిరుగుతూ జాబితాను సరిచేయాలని, మరణించిన వారి పేర్లు తొలగించాలని, పేర్లు, చిరునామాలు వంటివి ఏవైనా మార్పులు ఉంటే, పక్కాగా నిర్ధారణ చేసుకుని బీఎల్ఓ యాప్ ద్వారా మార్చాలని సూచించారు. ఆన్లైన్లో వచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలన జరిపి, ఐ.టీ టూల్స్ ద్వారా సరి చేయాలన్నారు. డ్రాఫ్ట్ పబ్లికేషన్ చేసే సమయానికే ఓటరు సవరణ జాబితా సమగ్రంగా రూపొందించబడితే, తదుపరి అభ్యంతరాలకు అంతగా ఆస్కారం ఉండదని అన్నారు. ప్రతి ఓటరుకు ఏ పోలింగ్ కేంద్రం పరిధిలో ఓటు హక్కు ఉంది అనే వివరాలు తప్పనిసరిగా తెలిసేలా బీఎల్ఓలు, బీఎల్ఓ సూపర్వైజర్లచే అవగాహన కల్పించేలా చూడాలన్నారు. ఓటర్లలో చైతన్యం పెంపొందించేందుకు స్వీప్ ఆక్టివిటీస్ ద్వారా విద్యా సంస్థలు, సామాజిక మాధ్యమాలు, బస్టాండులు తదితర రద్దీ ప్రదేశాలలో విస్తృత ప్రచారం నిర్వహించాలని సూచించారు. ఇంటింటి సర్వేకు వెళ్లిన సమయంలో ఎస్ఎస్ఆర్–2025 అని మార్కింగ్ చేయించాలన్నారు. 15 వందలు ఓటర్లు దాటిన పోలింగ్ కేంద్రాలను గుర్తించి, అలాంటి చోట కొత్తగా మరొక పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయాలన్నారు. గ్రామీణ ప్రాంతాలైతే ఒకే ప్రదేశంలో రెండుకు మించి పోలింగ్ స్టేషన్లు ఉండకూడదని, పట్టణ ప్రాంతాల్లో 4 పీ.ఎస్ లకు మించి ఒకే లొకేషన్ లో ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పరిశీలకులు అబ్దుల్ హమీద్ సూచించారు. ఓటరు జాబితాలో ఫోటో, చిరునామా సరిగా ఉందా లేదా అన్నది ఒకటికి రెండు పర్యాయాలు క్రాస్ చెక్ చేసుకోవాలని, ఒక కుటుంబానికి చెందిన ఓటర్లు అందరు ఒకే పోలింగ్ కేంద్రం పరిధిలో ఓటు హక్కు కలిగి ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. పోలింగ్ కేంద్రాలను సందర్శించి మౌలిక సదుపాయాలైన త్రాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్, కాంపౌండ్ వాల్ తదితర వసతులు సరిగా ఉన్నాయా లేదా అన్నది ముందుగానే పరిశీలించుకోవాలని అన్నారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా సమర్ధవంతంగా నిర్వహించేలా అన్ని విధాలుగా సన్నద్ధమై ఉండాలని సూచించారు. బూతు లెవెల్ ఆఫీసర్స్, సూపర్వైజర్స్, ఎన్నికల విభాగం కు సంబంధించిన రిజిస్టర్లు సక్రమంగా మెయింటైన్ చేస్తూ షెడ్యూల్ ప్రకారం ఎన్నికల కమిషన్ సూచించిన విధంగా కార్యకలాపాలు నిర్వహించాలని, అన్ని రాజకీయ పార్టీలు ప్రతినిధులతో క్రమం తప్పకుండా సమావేశాలు నిర్వహిస్తూ ఎస్ఎస్ఆర్–2025 కార్యక్రమాల గురించి వివరించాలని అన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ జిల్లాలో ఓటరు జాబితా సవరణ, స్వీప్ ఆక్టివిటీస్, పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు, తదితర వాటికి సంబంధించి చేపడుతున్న చర్యల గురించి కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు పరిశీలకులు అబ్దుల్ హమీద్ కు వివరించారు. అనంతరం జిల్లాలోని వివిధ పోలింగ్ కేంద్రాల పరిధిలో కొనసాగుతున్న ఇంటింటి ఓటరు జాబితా సవరణ తీరును పరిశీలకులు హమీద్ క్షేత్రస్థాయిలో పరిశీలించి, బీఎల్ఓలు, సూపర్వైజర్లను వివరాలు అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, నగరపాలక సంస్థ కమిషనర్ మకరంద్, బోధన్, బాన్సువాడ సబ్ కలెక్టర్లు వికాస్ మహతి, కిరణ్మయి, ఆర్డీఓలు రాజేంద్రకుమార్, రాజాగౌడ్, సహాయ ఈఆర్ఓలు, ఎన్నికల విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

# అమెరికాలోని డేట్రాయ్ లో గణేష్ వేడుకలు ఘనంగా నిమజ్జనంలి





**జనం వెలుగు:–** యూ.ఎస్.ఏలోని డేట్రాయ్ నగరంలో గణేష్ పండుగ ఉత్సవాలను ప్రవాస భారతీయులు ఘనంగా జరుపుకున్నారు. నవరాత్రుల్లో చివరి రోజు గణేష్ నిమజ్జనం కార్యక్రమాన్ని అత్యంత వైభవోపేతంగా నిర్వహించుకోవడంతో పాటు స్వదేశంలో లాగా కన్నుల పండువగా నిమజ్జనం నిర్వహించారు. భారతీయ సాంప్రదాయ పద్ధతిలో ప్రతి రోజూ శాస్త్రోక్తంగా పూజా కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు చివరి రోజు లడ్డూ వేలం పాటను నిర్వహించారు. నిజామాబాద్ కి చెందిన యలమంచిలి రామ్మోహన రావు కుమారుడు సాయి తేజ అతని స్నేహితుల బృందం లడ్డూ వేలం పాటలో 1.25,000 వేల రూపాయలకు లడ్డూను దక్కించుకున్నారు. ఈ సందర్భంగా గణేష్ ఉత్సవ కమిటీ నిర్వాహకులు నిజామాబాద్ నగరానికి చెందిన యలమంచిలి సాయి తేజ మాట్లాడుతూ మన దేశ సంస్కృతి, సాంప్రదాయాలను గౌరవిస్తూ మన ముఖ్యమైన పండగలను ఘనంగా జరుపకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నిజామాబాద్ నుంచి విజిట్ కు వెళ్లిన యలమంచిలి రామ్మోహన్ దంపతులతో పాటు పలువురు హిందూ కుటుంబాలు పాల్గొన్నాయి.

# రైతులకు సస్య రక్షణ చర్యలపై అవగాహన కల్పించాలి

- వ్యవసాయ అధికారులకు ఎమ్మెల్యే, కలెక్టర్ దిశానిర్దేశం
- నిర్లిప్తంగా వ్యవహరిస్తే వేటు తప్పదని హెచ్చరిక
- రైతు ప్రయోజనాలే పరమావధిగా పనిచేసే వారిని ప్రోత్సహిస్తామని వెల్లడి
- అన్నదాతకు నష్టం చేకూర్చే డీలర్ల లైసెన్సులు రద్దు చేయాలని ఆదేశం
- చీడపీడలు సోకకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించిన శాస్త్రవేత్తలు





**జనం వెలుగు, నిజామాబాద్, సెప్టెంబర్ 19:–** మరో నెల రోజుల్లోపు పంట దిగుబడులు చేతికి అందనున్న ప్రస్తుత తరుణంలో చీడపీడల బెడదతో రైతులు నష్టపోకుండా సస్యరక్షణ చర్యలపై వారికి అవగాహన కల్పించాలని శాసన సభ్యులు పి.సుదర్శన్ రెడ్డి, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు వ్యవసాయ అధికారులకు సూచించారు. ఇటీవల కురిసిన ఏకధాటి వర్షాలతో వాతావరణ పరిస్థితులలో చోటుచేసుకున్న మార్పుల కారణంగా పంటలకు దోమపోటు, ఆకుముడత వంటి తెగుళ్ళు, చీడపీడలు సోకే ప్రమాదం ఉండడడంతో, వాటి నివారణ కోసం ముందస్తుగానే చర్యలు చేపట్టేందుకు వీలుగా గురువారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో వ్యవసాయ శాఖ అధికారులతో సమావేశం నిర్వహించి దిశానిర్దేశం చేశారు. రుద్రూర్ వ్యవసాయ పరిశోధన కేంద్రం, కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలను ఈ సమావేశానికి ఆహ్వానించగా, ప్రస్తుత వాతావరణ పరిస్థితులలో ఆయా పంటలకు ఎలాంటి చీడపీడలు సోకే అవకాశం ఉంది, వాటి బారి నుండి పంట దిగుబడిని కాపాడుకునేందుకు పాటించాల్సిన పద్ధతులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై శాత్రవేత్తలు కీలకమైన సూచనలు చేశారు. రానున్న మూడు రోజులలో మరోమారు భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని వాతావరణ శాఖ హెచ్చరికలు చేసిన దరిమిలా పంటలకు నష్టం వాటిల్లకుండా చేపట్టాల్సిన చర్యల గురించి తెలియజేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు మాట్లాడుతూ, జిల్లాలో ఈసారి ఖరీఫ్ లో 4.29 లక్షల ఎకరాల విస్తీర్ణంలో వరి పంట సాగు చేశారని, అందులో 85 శాతానికి పైగా సన్నరకం ధాన్యం సాగు చేస్తున్నారని అన్నారు. భారీ వర్షాల వల్ల వరి పంటకు ఉధృత స్థాయిలో చీడపీడలు సోకే ప్రమాదం ఉన్నందున ముందస్తుగానే నివారణ చర్యలు చేపట్టాల్సిన ఆవశ్యకత ఏర్పడిందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ఏడీఏలు, ఏ.ఓలు, ఏ.ఈ.ఓలు, ఇతర వ్యవసాయ అధికారులు అందరు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ రైతులతో భేటీ అయ్యి వారికి సస్య రక్షణ చర్యలపై అవగాహన కల్పించాలని హితవు పలికారు. జిల్లాలో ఏ ఒక్క రైతు కూడా చీడపీడల వల్ల దిగుబడులు కోల్పోయి నష్టపోకుండా అంకిత భావంతో విధులు నిర్వర్తించాలని హితవు పలికారు. ఈ విషయంలో ఎవరైనా నిర్లిప్తంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎక్కడైనా చీడపీడల కారణంగా రైతులు నష్టపోతే, సంబంధిత వ్యవసాయ అధికారులను బాధ్యులుగా పరిగణిస్తామని అన్నారు. అదే సమయంలో రైతుల ప్రయోజనాలు కాపాడడమే ధ్యేయంగా పని చేసే వ్యవసాయ అధికారులకు అన్ని విధాలుగా ప్రోత్సాహం కల్పిస్తామన్నారు.

అదేవిధంగా రైతులకు నష్టం చేకూరేలా వ్యవహరించే ఎరువులు, విత్తన దుకాణాల డీలర్ల లైసెన్సులను రద్దు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. నకిలీ విత్తనాల విక్రయాలతో పాటు, అవసరం లేకపోయినప్పటికీ అధిక లాభార్జన కోసం ఎక్కువ పరిమాణంలో ఎరువులు, క్రిమిసంహారక మందులు రైతులకు అంటగట్టే డీలర్లపై నిఘా ఉంచి కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. క్రమం తప్పకుండా ఎరువులు, క్రిమిసంహారక దుకాణాలను తనిఖీ చేయాలని అధికారులను ఆదేశించారు. రైతులు సైతం దుకాణ డీలర్లను సంప్రదించకుండా, పంటలకు ఏవైనా చీడపీడలు సోకితే వ్యవసాయ అధికారులను, శాస్త్రవేత్తలను సంప్రదించాలని హితవు పలికారు. వారి సలహాలు, సూచనలను పాటిస్తూ అధిక దిగుబడులు సాధించి ఆర్థిక పురోగతిలో పయనించాలని అన్నారు. మోతాదుకు మించి ఎరువులు, పిచికారీ మందులు వాడి ఆర్థికంగా నష్టపోవడమే కాకుండా, భూసారాన్ని కోల్పోకూడదని జాగ్రత్తలు సూచించారు. ఈ దిశగా వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో రైతులకు అందుబాటులో ఉంటూ, అన్నదాతలు పూర్తి స్థాయిలో దిగుబడులు పొందేలా వారికి సలహాలు, సూచనలు అందించాలన్నారు. చీడపీడలు, తెగుళ్ల వ్యాప్తి చెందకుండా ముందస్తు జాగ్రత్తలు పాటించేలా పర్యవేక్షణ జరపాలన్నారు. పంటల మార్పిడి, స్వల్పకాలిక దిగుబడిని అందించే పంటలతో సమకూరే లాభాల గురించి అన్నదాతలకు అవగాహన కల్పించాలన్నారు. శాత్రవేత్తలు తెలియజేసిన సస్యరక్షణ చర్యలను క్షేత్రస్థాయిలో ప్రతి రైతుకు చేరేవిధంగా చూడాలన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వాజిద్ హుస్సేన్, శాస్త్రవేత్తలు డాక్టర్ బాలాజీ నాయక్, రాజ్ కుమార్, దివ్య, ఏ.డీ.ఏ ప్రదీప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.